సెంటిమెంట్ కొనసాగేనా?

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



తాడూరు: మండలంలోని పర్వతాయిపల్లి పాఠశాలను ఎంఈఓ భాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అల్పాహారం అందుతున్న తీరుతోపాటు విద్యార్థుల యొక్క నోటు పుస్తకాలు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్య, విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని హెచ్‌ఎం చంద్రయ్య సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్‌రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యం ఉన్నారు.

బీసీ గర్జనకు తరలిన నాయకులు



పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్‌లో సోమవారం నిర్వహించిన బీసీ గర్జనకు మండలంలోని ముష్టిపల్లి నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బీసీ కులాలకు ఏ రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకు వారికే ఓట్లు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో, కృష్ణయ్య, రాముడు, బుచ్చన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ

అమ్రాబాద్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ పీఓకే ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లల కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయా తరగతులకు సంబంధించిన వివిధ సబ్జెక్టులపై అవగాహన కల్పించే విధంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రయ్య, అధ్యాపకులు సుష్మ, రమేష్, అంజనేయులు, మల్లయ్య, మధుసూధన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులను కుక్కలు కరిచాయని వివరించారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సురేష్ గౌడ్, నర్సింహా, కృష్ణయ్య, శ్రీను, మహేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



బిజినేపల్లి: నవజాత శిశువుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. సోమవారం మండలంలోని పీహెచ్‌సీలో ఆశావర్కర్లకు నెలవారి సమీక్ష నిర్వహించారు. శిశువు ఆరోగ్యం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంపు వంటి అంశాలపై సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు తేజస్విని, మేఘనారెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీధర్, కిష్టమ్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి జంగయ్య మృతి చెందినాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, సర్పంచ్ చంద్రమ్మ, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట నాయకులు సోమయ్య, మల్లేష్, దానయ్య, లింగమయ్య, అల్లాజీ, దేవయ్య, గెల్వయ్య తదితరులు ఉన్నారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన మహిళ మూడావత్ జుమానీ సారాను అక్రమంగా తరలిస్తున్నాడు. సోమవారం గుట్టమీది తండా స్టేజీ సమీపంలో పోలీసులకు పట్టుబడినట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు. మహిళ నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అచ్చంపేటలో గెలిచిన పార్టీదే అధికారం

- 12సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే ప్రభుత్వ ఏర్పాటు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు

అచ్చంపేట: అచ్చంపేట నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలుపెట్టాయి. స్థానికంగా ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది. అచ్చంపేట ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

1962లో నియోజకవర్గం ఏర్పాటు..

1307 ఫసలీలో అమ్రాబాద్ తాలూకాగా ఉండేది. 1322 ఫసలీలో అచ్చంపేటకు మార్చారు. 1952, 1957 అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ్య నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉన్నది. 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.నాగన్న ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గ పునర్విభజనలోనూ ఎస్సీలకే రిజర్వు అయింది. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు మండలాలు పూర్తిగా అచ్చంపేట సెగ్మెంట్‌లోకి వచ్చి చేరాయి. పదర, చారకొండ కొత్త మండలాల ఏర్పాటుతో మొత్తం 8 మండలాలుగా నియోజకవర్గం ఉంది. 1962 నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే.. 12సార్లు ఇక్కడ గెలిచిన పార్టీయే అధికారం చేపట్టింది. 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తే.. ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు గెలుపొందడంతో చరిత్రకు గండి పడింది. 2014, 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీకి ఇక్కడ పట్టం కట్టడంతో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఇంతవరకు హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యేలు లేక పోవడం విశేషం.

వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధ్యానం..

అచ్చంపేట ఓటర్లు వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యమిస్తున్నారు. 1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకే ఓటర్లు పట్టం కట్టారు.6సార్లు కాంగ్రెస్, 5సార్లు టీడీపీ, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ విజయం సాధించాయి. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మహేంద్రనాథ్ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.



అచ్చంపేట పట్టణ వ్యూ

అత్యధిక.. అత్యల్ప మెజార్టీ




ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 46,181 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా 2,609 ఓట్ల మెజార్టీ నమోదైంది. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన పి.రాములు 46,181 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డి.కిరణ్‌కుమార్ 2,609 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

1962 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1962	కె.నాగన్న	కాంగ్రెస్	5,433
1967	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	12,502
1972	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	17,686
1978	ఆర్‌ఎం మనోహర్	కాంగ్రెస్.ఐ	9,310
1983	పి.మహేంద్రనాథ్	టీడీపీ	10,316
1985	మహేంద్రనాథ్	టీడీపీ	34,445
1989	డి.కిరణ్‌కుమార్	కాంగ్రెస్	2,609
1994	పి.రాములు	టీడీపీ	46,181
1999	పి.రాములు	టీడీపీ	12,346
2004	వంశీకృష్ణ	కాంగ్రెస్	20,665
2009	పి.రాములు	టీడీపీ	5,101
2014	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	11,821
2018	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	9,556

ఓటర్ల వివరాలు..

పురుషులు:	మహిళలు:	ఇతరులు:	సర్వీస్ ఓటర్లు:	మొత్తం:	పోలింగ్ కేంద్రాలు:
1,17,124	1,16,439	2	173	2,33,738	265



గువ్వల బాలరాజు(టీఆర్ఎస్)
చిక్కుడు వంశీకష్ణ (కాంగ్రెస్):
పోతుగంటి రాములు (టీడీపీ)

2018 ఎన్నికల్లో..

గువ్వల బాలరాజు (టీఆర్ఎస్)	చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్)	మేడిపల్లి మల్లేష్ (బీజేపీ)	నోటా
87,841	78,285	3,196	2,403

భౌగోళికంగా..

అచ్చంపేట నియోజకవర్గం జిల్లాలోనే చాలా పెద్దది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2166.37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అరుదైన వన్య ప్రాణులు, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి.

బీసీలు, ఎస్సీలే కీలకం..
నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కులాల వారీగా పరిశీలిస్తే.. 2,33,565 మంది ఓటర్లలో ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీలు 60వేలు, బీసీలు లక్ష 15వేలు, ఎస్టీలు 32వేలు, రెడ్డి, వైశ్యులు 20వేలు, ముస్లిం, మైనార్టీలు 7వేల మంది ఓటర్లు ఉన్నారు.

స్థానికేతరులకే పట్టం..



పుట్టపాగ మహేంద్రనాథ్

అచ్చంపేట నియోజకవర్గానికి మరో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఎక్కువగా స్థానికేతరులే ఉన్నారు. మొత్తం 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. 10సార్లు స్థానికేతరులు ఎన్నిక కావడం విశేషం. 1994, 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే స్థానికులైన పి.రాములు, చిక్కుడు వంశీకృష్ణలు ఎన్నికయ్యారు. 1962లో కె.నాగయ్య, 1978లో హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎం మనోహర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972, 1983, 1985 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ ఎన్నిక కాగా, 1989లో నాగర్‌కర్నూల్ మండలం శాయిన్‌పేటకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో అచ్చంపేట సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే పి.రాములు స్వగ్రామమైన గుండూరు.. కల్వకుర్తి నియోజకవర్గంలోకి చేరడంతో ఆయన స్థానికేతరుడు అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన గువ్వల బాలరాజుది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్ గ్రామం.

2009లో అప్పాపూర్‌లో పోలింగ్ బూత్..

నల్లమల అభయారణ్యంలోని అప్పాపూర్ చెంచుపెంటలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో 180/182ను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో 12 చెంచుపెంటలకు చెందిన గిరిజనులు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



విలేకరుల సమావేశంలో డోర్‌స్టిక్కర్లను చూపుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీను

కల్వకుర్తి టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలలో విధిగా వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని కల్వకుర్తి రిటర్నింగ్ అధికారి శ్రీను అన్నారు. సోమవారం రిటర్నింగ్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 83,059 నివాస గృహాలు ఉన్నాయని, ఇంటింటికి తిరిగి డోర్ స్టిక్కర్ క్యాంపెయినింగ్‌ను చేపడుతున్నామని ఆయన తెలిపారు. పోలీచిట్టీలను పంపిణీ చేసేందుకు సులభంగా ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం యొక్క రూట్‌మ్యాప్‌తో పాటుగా ఆ కేంద్రం వివరాలను అందులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే సీ–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫిర్యాదు చేయొచ్చన్నారు. అనంతరం ఇంటింటికి అంటించే 'ఫ్రైడ్ టూబీ ఓటర్' డోర్‌స్టిక్కర్లను రిటర్నింగ్ అధికారి శ్రీను విడుదల చేశారు.

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై చేరికలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం

పెంట్లవెల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు ఆధ్వర్యంలో దాదాపు 80 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జూపల్లి కృష్ణారావు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజేష్, మథీన్, శేషు, గోపి పాల్గొన్నారు.
కొల్లాపూర్: పట్టణంలోని పలు వార్డులకు చెందిన నాయకులు, మొలచింతలపల్లి, కుడికిళ్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బీరం బిచ్చమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, మాధరావుపల్లి, మాందాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీలు మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, కమలేశ్వర్‌రావు, సోమ్‌నాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు, అభిలాష్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పలు కాలనీలలో సోమవారం జూపల్లి కృష్ణారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మల్లేశ్వరంలో కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. మల్లేశ్వరం, వేముకల్ గ్రామాల నుంచి 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, మదుగం బాలరాజు యాదవ్, హరిప్రసాద్, నర్సింహనాయుడు, బాలరాజు, కురుమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీవైపీ అభ్యర్థి తిరుపతమ్మ

కొల్లాపూర్: భారత చైతన్య యువజన పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా కాటమోని తిరుపతమ్మను ప్రకటించారు. సోమవారం ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ నుంచి ఆమె బీఫారం అందుకున్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం

తెలకపల్లి/బిజినేపల్లి: కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గుగ్గిల్లప్రకాష్, శేఖర్, రాముడు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్వగ్రామం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. సోమవారం గ్రామంలో ప్రజా చైతన్య యాత్రకు గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందని లభించింది. ఊహించని రీతిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాజేష్‌రెడ్డి తెలిపారు.



బీఎస్పీ వినూత్న ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: అచ్చంపేట నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి మోత్కూరి నాగార్జున వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. బీఎస్పీ ఎన్నికల గుర్తు ఏనుగు ప్రతిమను వాహనంపై ఏర్పాటు చేసి పట్టణం, గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కల్వకుర్తి మండలంలోని తాండ్రలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి బీఎస్పీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, మల్లేష్, పరమేష్, వినయ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

అమ్రాబాద్: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల మన్ననూర్ వైద్యాధికారి డాక్టర్ పానుగంటి జాన్సన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

గులాబీ జెండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేద్దామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పల్కపల్లిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు సాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.
ఉప్పునుంతల: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతనే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఓట్లు అడగాలని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్లపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తు భూపాల్‌రావు, ఎంపీటీసీ రామలక్ష్మమ్మ, రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి, దామోదర్, ఖాజా, శంకర్, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గూటికి బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు



కొల్లాపూర్: బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బురుగుల మునిస్వామి సోమవారం పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో చేరారు. చిన్నమల్లయ్య, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.
పెద్దకొత్తపల్లి: నక్కలపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన చింతకుంట రాజయ్య, సాములు, శ్రీశైలం గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు సమక్షంలో చేరారు. కార్యక్రమంలో జలాల్‌శివుడు, బీమేష్, తిరుమల్, శేకర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేష్, సతీష్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: తెలకపల్లి మండలంలోని కమ్మరెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రిజనార్దన్‌రెడ్డి సతీమణి మర్రిజమునారెడ్డి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ శివలీల, మండల అధ్యక్షుడు యారరమేష్, సర్పంచ్ యాదమ్మ, పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

తెలకపల్లి: మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించిన సమావేశానికి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎంపీటీసీల ఫోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లే ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



సమావేశంలో పాల్గొన్న నిరుద్యోగ జేఏసీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కుంభం రామకృష్ణగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేసి తర్వాత పరీక్షా పత్రాలను లీకేజీ చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నిరుద్యోగులందరు ఏకమై ఊరుఊరు తిరిగి గడపగడపకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు చేసిన అన్యాయాన్ని, మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో జేఏసీ జిల్లా కార్యదర్శి గుర్రం శ్రీకాంత్, కోశాధికారి వడ్డేమాన్ శ్రీకాంత్, సుదర్శన్, వెంకటేష్, కరుణాకర్, మల్లేష్, శివకుమార్, అశోక్, శివకాశి, విజయలక్ష్మి, అనిత, వరలక్ష్మి, పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కోడేరులో విశ్వరూప మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కోడేరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం విశ్వరూప మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మిద్దె కృష్ణయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న సికింద్రాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో విశ్వరూప మహాసభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మండలం నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజమౌళి, రవీందర్, నర్సింహ్మ, మూర్తి, రామకృష్ణ, అర్జున్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.
పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగ ఉప కులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, కృష్ణయ్య, నాగరాజు, అర్జున్, యాదగిరి, సురేష్, సుభాష్, రాము పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం




పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లిలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథం ద్వారా సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడారు. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, సాంద్ర సింధు వేదం వివరణ తెల్పడం జరిగిందన్నారు. దేవుడు సృష్టి ఆదిలో ఆకాశం యొక్క మేఘాల శబ్దం ద్వారా దైవ జ్ఞానం తెలియస్తుందన్నారు. అదే జ్ఞానాన్ని దేవుడు శ్రీకృష్ణుడిగా పుట్టి ద్వాపర యుగంలో భగవద్గీతగా తెలియజేశాడని, అటువంటి ముఖ్యమైన జ్ఞానంలో ముగ్గురు పురుషుల యొక్క వివరం పురుషోత్తమ ప్రాప్తి యోగం 16, 17 శ్లోకాల్లో ఉందని, దాని ఆధారంగానే శాస్త్రబద్ధంగా 'త్రైత సిద్ధాంతం భగవద్గీత' యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు నాగరత్నం, కృష్ణయ్య, సురేష్, శ్రీనివాసురెడ్డి, ఉజార్, శివమ్మ, లక్ష్మి, మన్నెం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా

సాక్షి, నెట్‌వర్క్: రాబోయే ఎన్నికల్లో తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరువేరుస్తానని బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. సోమవారం పట్టణంలోని పలువార్డుల్లో ఆయన భారీ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. మహిళలతో కలిసి నృత్యం చేస్తూ ఓటర్లను ఉత్సాహపరిచారు. రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని బైరాపూర్, నగారగడ్డతండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మల్లికార్జున, వెంకట్‌రాములు, జాన్సీరామ్, సీతారం, రవి, గోపాల్, రమేష్, లక్ష్మణ్, నవీన్, కిషన్, శ్రీను, తదితరులు ఉన్నారు.

9 నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదానం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో ఈనెల 9వతేదీ నుంచి అయ్యప్ప స్వామి మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేష్‌చారి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో సేవా సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. దైవభక్తితోనే ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గురు స్వాములు మండికారి బాలాజీ, కేతేపల్లి వెంకటేష్, లక్ష్మణాచారి, రాజశేఖర్, నరేష్, వెంకటేష్, గోపాల్, భరత్, శివ పాల్గొన్నారు.